కథానిక

# సదానందం

– టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి



సదానందం అంటే నాకెప్పుడూ సదభిప్రాయం లేదు. పైగా కొద్దో గొప్పో ద్వేషభావం కూడా వుండేది. అలాగని అకారణ ద్వేషం మాత్రం కాదు... ఎందుకంటే నా వైపు నుండీ ఏవో కారణాలు లేకపోలేదు.

నేను ఎంతగానో ప్రేమించిన పరిమళను అతడు పెళ్ళి చేసుకోవడం, అతడు నాకన్నా అందగాడూ, ఐశ్వర్యవంతుడూ కావడం, నాకు ఉద్యోగం రాక మునుపే అతడు సర్వీస్ కమిషన్‌లో సెలక్టయి గెజిటెడ్ ఉద్యోగం సంపాదించుకుని వుండడం.... ఇలాంటివన్నీ అతడిమీద నాకు ద్వేషభావం కలగడాన్కి కారణాలనుకున్నా సదభిప్రాయం లేకపోవడానికి మాత్రం కారణం ఏమిటో నాకే తెలియదు నిజానికి.

దాదాపు ముప్ఫయి సంవత్సరాల క్రితం పరిమళను ప్రాణాధికంగా ప్రేమించేసి నా ప్రేమనంతా వ్యక్తపరుస్తూ ఉత్తరం వ్రాసి నూతన సంవత్సరపు శుభాకాంక్షలతో పాటు ఆమెకు అందించిన తరువాత.... మూడు రోజులపాటు వణికించే చలిలో విరహాగ్నితో కాగిపోతూ నిద్ర లేని రాత్రులనూ, చిరువెచ్చటి నీరెండలో తీయని తలపులతో, కలలతో పులకించిపోతూ పగళ్ళనూ గడిపిన తరువాత... ఆమె అందించిన జవాబును పదే పదే కళ్ళకద్దుకుని పెదవులతో స్పర్శించి వణకుతున్న చేతులతో విప్పాను.

"రాజారావుగారికి

మీరు అందించిన ఉత్తరం చదివి నేను ఎంత బాధనూ మానసిక క్లేశాన్నీ అనుభవించానో వర్ణించలేను.

నేను మీకేసి ఆత్మీయంగా చూడడం, నవ్వడం వెనుక మీరు ఊహించుకున్న కారణాలేవీ లేవు. అసలు మీరింత రాంగ్ డైరెక్షన్‌లో ఆలోచిస్తారని నేను కలలో కూడా అనుకోలేదు.

సరిగ్గా ఎనిమిది సంవత్సరాల క్రితం చనిపోయిన మా పవన్ అన్నయ్య పోలికలు మీలో చాలా ఎక్కువగా వుండడం వల్ల అసంకల్పితంగానే నేను అంత ఆర్తిగా మీ వైపు చూస్తూ వచ్చాను. ఈ ఉత్తరంతోపాటు అన్నయ్య ఫోటోగ్రాఫ్ ఒకటి జతపరుస్తున్నాను. ఒక్కసారి ఆ ఫోటోను పరికించండి... నా భావాలేమిటో మీకు పూర్తిగా అర్థం అవుతాయి.

ఇకపోతే నా వివాహం అమ్మ తమ్ముడైన సదానందం మామయ్యగారితో కొన్ని సంవత్సరాల క్రితమే నిశ్చయింపబడిపోయింది.

మిమ్మల్ని నొప్పిస్తున్నందుకు క్షమాపణలతో!

ఒకసోదరి, పరిమళ"

నేను తేరుకోవడానికి చాలా రోజులే పట్టింది. తరువాత క్యూరియాసిటీ కొద్దీ ఎంక్వయిరీ చేసి సదానందం ఎవరో కనుక్కుని అతన్ని చూశాను. నాకన్నా నాలుగైదు సంవత్సరాలు పెద్దవాడైనా అందంగా ఆకర్షణీయంగా వుండి మంచి ఉద్యోగం వున్న అతన్ని చూడగానే ఈర్ష్యాసూయలు తన్నుకు వచ్చాయి. నాలో అసంకల్పిత ప్రతీకార చర్యలా.

వారికి వివాహం జరిగిపోవడం సదానందానికి దూర ప్రాంతానికి బదిలీ అయి వారు వెళ్ళిపోవడం జరిగాక "అవుటాఫ్ సైట్.. అవుటాఫ్ మైండ్" అన్నట్లుగా ఆమెను మరచిపోతూ వచ్చి, నన్ను ప్రేమిస్తున్న మృదులను పెళ్ళి చేసుకునేశాను.

ఇదంతా జరిగి పాతికేళ్ళకు పైగా గడిచిపోయాక .... నేను కర్నూలులో పని చేస్తోండగా మా బ్రాంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా సదానందం రావడంతో ఎప్పుడో, ఎక్కడో, ఎలాగో తెగిపోయిన బంధం మళ్ళీ మరో రకంగా కలియడానికి అవకాశం కలిగింది.

ఓ వెడ్డింగ్ అకేషన్‌లో పరిచయం అయిన పరిమళ, మృదులలు మంచి స్నేహితురాళ్ళుగా మారడంతో మా కుటుంబాల మధ్య రాకపోకలు జరుగుతూ వచ్చాయి.

మా అబ్బాయి తేజస్వి పరిమళ కుమార్తె కేదారిని ప్రేమించడంతో చరిత్ర పునరావృత్తం అయింది.

ఉద్యోగంలోనే కాదు ఆర్థిక పరమైన స్థితిగతుల్లో కూడా ఎంతో ఎత్తున వున్న వారితో వియ్యం సాధ్యం కాదంటూ మావాడ్ని కేకలేశాను నేను. కానీ పరిమళ చొరవతో సదానందం అంగీకరించడంతో కేదారి కోడలిగా మా ఇంట అడుగు పెట్టింది.


తరువాత మరో ఆర్నెల్లయినా గడువక మునుపే వారి అబ్బాయి శశాంక మా అమ్మాయి సుమతి ఒకర్నొకరు ఇష్టపడడంతో త్వరలోనే మరో శుభకార్యం జరిపించక తప్పలేదు. కానీ నాకు ట్రాన్స్‌ఫర్ రావడంతో మా రెండు కుటుంబాలూ బాగా దూరం కాక తప్పలేదు.

ఇంత సుదీర్ఘమైన చరిత్ర తరువాత కూడా నాకు సదానందం మీద సదభిప్రాయమూ, ప్రేమాభిమానమూ పెంపొందలేదు.

నాకు బట్టతల ఏర్పడిపోతున్నా కూడా అతని జుత్తు రాలకపోవడం, చెవుల్ల వద్ద మాత్రమే నెరవడం, ఇంత వయసు వచ్చినా సూటు వేసిన రోజు తను పెళ్ళి కొడుకులా కన్పించడం నాకెందుకో అయిష్టాన్నే కలిగించేవి.

సదాశివం, పరిమళలు సరదాగా, హుషారుగా నవ్వుతూ, తుళ్ళుతూ,

నాకు బట్టతల ఏర్పడిపోతున్నాకూడా అతని జుత్తు రాలకపోవడం, ఇంత వయసు వచ్చినా సూటు వేసినప్పుడే పెళ్ళి కొడుకులా కనిపించడం నాకు అయిష్టాన్నే కలిగించేవి. సదాశివం, పరిమళలు సరదాగా హుషారుగా నవ్వుతూ తుళ్ళుతూ ఆనందంగా కన్పించగా నేనేనాడూ చూల్లేదు. రక్తసంబంధీకులైన ఆ భార్యాభర్తల మధ్య పెద్దగా ప్రేమాభిమానాలుండవనీ, పరిమళను అతడు పిచ్చిగా ఏనాడూ ప్రేమించి వుండడనీ నా నమ్మకం.



బాగా ఆనందంగా కన్పించగా నేనేనాడూ చూడలేదు.

రక్త సంబంధీకులైన ఆ భార్యాభర్తల మధ్య పెద్దగా ప్రేమాభిమానాలు వుండవనీ, పరిమళను అతడు పిచ్చి పిచ్చిగా ఏనాడూ ప్రేమించి వుండడనీ, ప్రేమించ లేడనీ, ప్రేమించబోడనీ నా నమ్మకం.

ప్రేమించడం నాకు చేతనయినంత బాగా మరెవరికీ చేతకాదని నా ప్రగాఢ విశ్వాసం

xxxx

ఎంతో శ్రమపడి మా అబ్బాయికీ, తను వాలంటరీ రిటైర్‌మెంటు పుచ్చుకుని మా అల్లుడికీ ఉద్యోగాలు ఇప్పించి వేశాడు సదానందం. తరువాత ఆరు నెలలైనా గడువలేదు.....

"మదర్ నోమోర్... హార్ట్ ఎటాక్... స్టార్ట్ బైకార్" అల్లుడు శశాంక ఇచ్చిన టెలిగ్రాం నా చేతుల మధ్య నలిగిపోయింది.

గుండెలవిసేలా రోదిస్తున్న కేదారిని అక్కున చేర్చుకుని నేనూ, నా శ్రీమతీ, తేజస్వీ పది గంటలు ప్రయాణం చేసి పరిమళను చేరాము.

పడుకుని ప్రశాంతంగా నిద్రిస్తున్న దానిలా వుంది పరిమళ.

మీ రాక కోసమే ఎదురు చూస్తున్నాడు సదానందం.

"పిల్లలందరి బాధ్యతా ఇకపై మీదే బావగారూ!" అన్నాడు నా చేతులు పట్టుకుని కళ్ళనీళ్ళతో.... ఏం చెప్పగలను....? నిజానికి నేనే ఓదార్పు కోరుకుంటున్నాను!

ఏర్పాట్లు జరిగిపోతుండగా హఠాత్తుగా గుండె నొప్పితో కుప్పకూలి పోయాడు సదానందం.

మేం వచ్చిన కార్లోనే హాస్పటల్‌కు తీసుకు పోతోండగా దార్లో ఓసారి తెలివి వచ్చింది అతనికి "ఎందుకు హాస్పటల్‌కు వెళ్ళడం... పరిమళ లేని లోకంలో నేనెక్కడుంటాను...?" అంటూ తలవాల్చేశాడు మళ్ళీ.

పరిమళ ప్రాణం పోయిన ఆస్పత్రిలోనే సదానందం కూడా అంతిమ శ్వాస వదిలాడు. రెండు గంటల తరువాత

"డెత్ క్లోసెస్ ఆల్!" అన్నాడో ఆంగ్లకవి....

పది రోజులు గడచిపోయాయి.

బాధ్యతలు మనుషులను విషాద రేఖల మధ్యనుండీ కొద్ది కొద్దిగా వెలుపలికి లాగ గలుగుతాయి.

డెత్ సర్టిఫికెట్స్ కోసం కార్పొరేషన్ ఆఫీసుకు వెళ్ళాను. హాస్పటల్ నుండీ డెత్ రిపోర్ట్సు అందలేదని తెలియడంతో అట్నుంచి అటే హాస్పటల్‌కు వెళ్ళాను.

"వెరీ సారీ సర్... ఆపరేషన్ కేసులు ఎక్కువగా రావడం వల్ల బిజీలో వుండిపోవడం వల్ల డెత్ రిపోర్ట్సు, పంపడం కాస్త ఆలస్యం అయింది.. ఈ రోజు పంపేస్తాను!" అన్నాడు డాక్టర్ ధనుంజయ.

"నాకు ఇవ్వండి.. నేనే కార్పొరేషన్ ఆఫీసుకు తీసుకు వెళ్ళి రిజిస్టర్ చేయించుకుంటాను. నాకు సర్టిఫికెట్స్ అవసరంగా కావాలి!" అన్నాను.

"ఓ.కే.! ఒన్ మినిట్!" అంటూ డెత్ రిపోర్ట్ ప్యాడ్ అందుకుని అయిదు నిమిషాలలో పరిమళ, సదానందాల డెత్ రిపోర్ట్సు చకచకా తయారుచేసి ఇచ్చేశాడు డాక్టరు ధనుంజయ తమ రికార్డ్సు వెరిపై చేసుకుంటూ.

హాస్పటల్ నుండీ వెలుపలికి వచ్చే ముందు డాక్టరు ఇచ్చిన రిపోర్ట్సు రెండూ ఓ పర్యాయం పరిశీలించాను.

పరిమళ డెత్ రిపోర్టులోని కాజ్ ఆఫ్ డెత్ కాలంలో "కార్డియో రెస్పరేటరీ ఫెయిల్యూర్" అని వ్రాయబడి ఉంది.

సదానందం డెత్ రిపోర్టులోని కాజ్ ఆఫ్ డెత్ కాలంలో "కార్డియో రెస్పరేటరీ అరెస్ట్" అని వ్రాయబడి వుంది.

అప్పుడు తన్నుకు వచ్చింది దుఃఖం ఎడతెరిపి లేకుండా ... నా హృదయాంతరాంతరాలలోంచీ! నా కళ్ళ నుండీ కృష్ణా, గోదావరులే కాల్వలు కట్టాయి!!

సదానందంతో వియ్యమందడం ద్వారా అతని ఇంటి తలుపు తట్టగ లిగానే కానీ అతని గుండె తలుపులు తట్టలేకపోయాను నేను.

సదానందం పరిమళను ఎంతగా ప్రేమించాడో అర్థం అయింది నాకు.

"అందులో సగభాగమైనా నేను గతంలో పరిమళను ప్రేమించానా? కనీసం అందులో సగంలో సగభాగమైనా నా శ్రీమతిని ప్రేమించగ లిగానా? ప్రేమించగలనా?" అని ఆలోచిస్తూ కార్పొరేషన్ ఆఫీసుకేసి కదిలాను.

◆

18-6-93 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక